

ఆయిల్ దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆయిల్ దుకాణాల్లో అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. కల్తీ నూనెలతో పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికను ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆహార భద్రత అధికారిణి తస్లీం సోమవారం పట్టణంలో శ్రీ ట్రేడర్స్ అయిల్ డిపోలో ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా విడి నూనెను శాంపిల్ తీసి, దుకాణంలో అపరిశుభ్రత ఎక్కువ ఉండడంతో నోటీసు ఇచ్చారు. ఈ విషయం తెలియడంతో మిగిలిన దుకాణాదారులు వారి షాపులను మూసి వేశారు. దీంతో లేపాక్షి అయిల్ దుకాణాన్ని తనఖీ చేసి, కబాబ్ పౌడర్‌ను శాంపిల్ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కల్తీ ఆహార పదార్థాలను ఎవరు అమ్మిన వారిపై కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.



గత ఏడాది మూల్యాంకన రెమ్యునరేషన్‌ను విడుదల చేయాలని కోరుతూ పది మూల్యంకన కేంద్రం వద్ద నిరసన

పది మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారం ప్రారంభం అయ్యింది. మూల్యంకన కార్యక్రమాన్ని కడప ఆర్జేడీ రాఘవరెడ్డి, డిఇఒ మీనాక్షి పరిశీలించారు. ఉపాధ్యాయులతో అక్కడి ఏర్పాట్లపై మాట్లాడారు. ఉపాధ్యాయులకు భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలను అందించాలని సిబ్బంది సూచించారు. ఎనిమిది రోజులపాటు మూల్యాంకనం జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని సబ్జెక్టులకు 735 మంది ఉపాధ్యాయులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వత్తి విద్యాధికారి లాజర్, ఏడీలు నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2023 మూల్యాంకన రెమ్యునరేషన్‌ను చెల్లించండి : యుటిఎఫ్

2023 పది మూల్యాంకనంకు సంబంధించి ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యునరేషన్ బకాయి నగదును వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల మూల్యాంకన కేంద్రం వద్ద సోమవారం నాడు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ గత సంవత్సరం రెమ్యూనరేషన్ బకాయిలను ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు ఇవ్వలేదన్నారు. రూ.84 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.75 లక్షలు ఇచ్చారని ఇంకా రూ.9 లక్షల బకాయి ఉందన్నారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అన్ని వసతులూ ఏర్పాటు చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. రంజాన్ నేపథ్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం డిఇఒ మీనీక్షికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు జిహెచ్.బాబు, బాబయ్య, రవీంద్రనాథ్, రవీంద్రారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, కృష్ణతేజ, నాగమణి, సరస్వతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటుహక్కు పొందేందుకు చివరి అవకాశం

14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



కలెక్టర్ అరుణ్‌బాబు

ఓటుహక్కు పొందేందుకు ఎన్నికల కమిషన్ చివరి అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా ఈ నెల 14వ తేదీ లోపు ఓటు కోసం ధరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. అత్యంత విలువైన, అమూల్యమైన ఓటుహక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. 14వ తేదీలోపల ధరఖాస్తు చేసుకున్న వారందరికీ ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పిస్తుందని చెప్పారు. కొత్త ఓట, చిరునామా మార్పు కోసం ఈ నెల 14వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఏప్రెల్ 14వ తేదీ తరువాత వచ్చే దరఖాస్తులను ఎన్నికల తరువాత మాత్రమే పరిశీలిస్తారని తెలియజేశారు. నామినేషన్లను దాఖలు చేసేవరకు ఓటు నమోదుకు ధరఖాస్తు చేసే అవకాశం ఉందన్నారు. వచ్చిన వాటిని పరిశీలించి, జాబితాల్లో చేర్చడానికి పదిరోజుల సమయం పడుతుంది కాబట్టి, ధరఖాస్తు చేయడానికి చివరితేదీ ఏప్రెల్ 14గా నిర్ణయించినట్లు తెలియజేశారు.

సిపిఎం నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో మేము సైతం సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సుయాత్ర సోమవారం కదిరి పట్టణానికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రధానంగా రైతులు, నిరుద్యోగులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి జగన్ పర్యటనను ఎక్కడ అడ్డుకుంటారోనని భయంతో సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు బాబ్ జాన్, రాజేంద్ర మస్తాక్ ఇతర ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిఎల్ నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకొంటామోనని పోలీసులు చేత తమను ముందస్తు అరెస్టు చేయించడం సిగ్గుచేటని అన్నారు. తమది రైతుల పక్షపాతి ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు రైతుల సమస్యలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. యువతకు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇచ్చిన హామీని విస్మరించారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ కు చిత్త శుద్ధి ఉంటే జిల్లాలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంటనే స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్నిఉపసంహరించుకోవాలని జిల్లాలో ప్రధాన సమస్యలు పరిష్కరించిన తర్వాతే జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు .

విద్యార్థులా.. పనిమనుషులా..?

ఉపాధ్యాయుల తీరుపై ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆగ్రహం

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు పనిమనుషులుగా మార్చుతున్నారని ఎస్ఎఫ్ఐ, ఎఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులను కించపర్చుతూ మాట్లాడుతున్నట్లు విడియోలు బయటకు రావటంతో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలోనే ఇక్కడ విద్యార్థులు వాటర్‌క్యాన్లు మోస్తూ కన్పించారు. దీంతో నాయకులు ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వచ్చారా లేక స్కూల్లో పనులు చేయడానికి వచ్చారా అని ప్రశ్నించారు. విద్యార్థుల దగ్గర పనులు చేయించిన వారిపై ఉన్నత విద్యాశాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వాటర్‌క్యాన్ మోసుకుని వెళుతున్న విద్యార్థులు

మౌనంగా సాగిన మేమంతాసిద్ధం..!

◆ ప్రసంగాలు లేకుండానే ముఖ్యమంత్రి బస్సుయాత్ర
◆ అభివాదాలు.. పలకరింపులతోనే సరి
◆ ఉమ్మడి జిల్లాలో ముగిసిన జగన్ పర్యటన



మేము సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్నవైసిపి శ్రేణులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగిసింది. శనివారం నాడు కర్నూలు జిల్లా తుగ్గలి నుంచి ప్రారంభమైన ఆయన యాత్ర అదే రోజు మధ్యాహ్నం గుత్తి మండలంలోకి ప్రవేశించింది. గార్లదిన్నె, అనంతపురం మీదుగా రాప్తాడు నుంచి సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం వరకు సాగింది. ఆదివారం నాడు యాత్రకు విరామం ఇవ్వడంతో అక్కడే బస చేశారు. సోమవారం ఉదయం సంజీవపురం నుంచి ప్రారంభమైన యాత్ర బత్తలపల్లి, ముదిగుబ్బ, నాగారెడ్డిపల్లి మీదుగా రాత్రికి కదిరి చేరుకుంది. అక్కడి నుంచి రాత్రికి అన్నమయ్య జిల్లా చీకటిమానుపల్లి వద్ద ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బస చేశారు. అక్కడికి చేరుకునే సరికి సమయం చాలా ఆలస్యమైంది. బత్తలపల్లి, ముదిగుబ్బ, కదిరి పట్టణాల్లో భారీ జనసందోహం నెలకొంది. పెద్దపెద్ద గజమాలలతో ముఖ్యమంత్రికి భారీ పెద్దఎత్తున స్వాగతాలు పలికారు. భారీ జనందోహం నడుమ నిర్ణీత సమయం ప్రకారం పర్యటనలు సాగలేదు. రెండు,మూడు గంటలు ఆలస్యంగానే రెండు రోజుల పర్యటనలు సాగాయి. ఈ ఆలస్యం కారణంగా కదిరిలో ఇఫ్తార్ విందుకు కూడా సాయంత్రం ఐదు గంటలకు రావాల్సింది రాత్రి ఎనిమిది గంటలకు వెళ్లారు.



కదిరిలో ముస్లిములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలుచేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

మౌనంగా ముగిసిన పర్యటన

ఎన్నికల సమయం కావడంతో ముఖ్యమంత్రి పర్యటనలో వాడీవేడి ప్రసంగాలుంటాయని అందరూ భావించారు. ప్రతిపక్షాలపై విమర్శలతోపాటు, ఐదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం గురించి పెద్దఎత్తున ప్రజలకు వివరిస్తారని అందరూ భావించారు. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతకల్లు, శింగనమల, అనంతపురం, రాప్తాడు, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించినా ఎక్కడా ఎటువంటి ప్రసంగాలూ లేకుండా సాగాయి. ప్రజలకు అభివాదాలు చేస్తూ అవకాశమున్న చోట సామాన్య జనాన్ని కలుస్తూ యాత్రను ముగించారు. ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన హామీలు కూడా ఏవీ లేకుండానే సాగాయి. దీంతో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు ప్రతి విమర్శలు చేయడానికి పెద్దగా అవకాశం లేకుండా సాగింది.

ఇద్దరు ముఖ్య నేతలు వైసిపిలో చేరిక

ముఖ్యమంత్రి చేపట్టిన మేమంతా సిద్ధం యాత్ర సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు ముఖ్య నేతలు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. అందులో కళ్యాణదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఒకరు కాగా, కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా మరొకరు. టిక్కెట్లు ఆశించి రాకపోవడంతో ఈ ఇద్దరు నేతలు పార్టీని మారారు. వీరితోపాటు మాజీ ఎంపిపి, జడ్పిటిసిలు ఇతర నాయకులు మరికొంత మంది పార్టీలో చేరారు.

ఒప్పుకుంటే...తప్పుకుంటా...

లేకపోతే రెండు స్థానాల్లో బరిలో ఉంటా.... పరిపూర్ణానంద

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి, జనసేన, బిజెపి కూటమి హిందూపురం సమగ్ర అభివృద్ధి కోసం తాను రూపొందించిన సప్తపది కార్యక్రమాలకు ఒప్పుకుంటే ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటానని.లేకపోతే ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో బరిలో ఉంటానని స్వామి పరిపూర్ణానంద వెల్లడించారు. సోమవారం పట్టణంలోని గుడ్డం రంఘనాథ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూపురం సమగ్ర అభివృద్ధికి సప్తపది కార్యక్రమం చేపట్టమన్నారు. హిందూపురం వాసులు తనకు అవకాశం ఇస్తే ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి సప్తపది అని ఏడు అంశాలు లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు. ఈ ఏడు అంశాలు కూటమి చేస్తామని ఒప్పుకుంటే తాను ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటానన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - గోరంట్ల

వైసిపి ప్రభుత్వ హయాంలో గోరంట్ల మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పెనుగొండ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి సవితమ్మ విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి నాయకులు రియల్ ఎస్టేట్ దందాలు చేస్తూ దోచుకొని తిన్నారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయడానికి టిడిపి కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు వాలంటీర్లను అడ్డంపెట్టుకొని ఎన్నికల్లో గెలుపొందడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, టౌన్ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, నాయకులు వేణు జయరాం, బాలకృష్ణ చౌదరి, రాజారెడ్డి, జనసేన పార్టీ నాయకులు సంతోష్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'టిడిపి హయాంలో బీసీలకు పెద్దపీట'

మడకశిర : తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు పెద్దపీట వేశారని కుంచిటి వక్కలిక రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప తెలిపారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండల కేంద్రంలో కేంద్రంలో జయహో బీసీ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ అంటే బీసీలు,బీసీలు అంటే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎంపీపీ అశ్వర్థ రామప్ప ,రాష్ట్ర రైతు కార్యదర్శి ఉగ్ర నరసింహప్ప, సీనియర్ నాయకులు లెజెండ్ సుధాకర్, వక్కలిక సంఘం డైరెక్టర్ జయరామప్ప,రాష్ట్ర రైతు కార్యదర్శి కేఎం పల్లి సురేష్, మాజీ ఎంపీపీ హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : బిసిల ఎదుగుదల టిడిపితోనే సాధ్యమని ఆపార్టీ బీసీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పాండురంగనగర్ కనకదాసు కళ్యాణమంటపంలో సోమవారం 7వ క్లస్టర్ ఇన్చార్జి. 25వ వార్డు కౌన్సిలర్ ఎస్ఆర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాజీ మున్సిపల్ చైర్మన్ జెవీ అనిల్ కుమార్, బేవినహళి ఆనంద్, జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, బీసీ సెల్ పట్టణాధ్యక్షుడు నవీన్, పార్టీ నాయకులు అమర్నాథ్, పరిమళ, భాస్కర్, నబీరసూల్, శివశంకర్, వెంకటేశ్, చెన్నమ్మ, విజయలక్ష్మీ, మోదా శివకుమార్, నాగేంద్ర, మురళీ, శశికళ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

◆ అధికారులు చర్యలు తీసుకోవాలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను వెంటనే పరిరక్షించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నాడు జిల్లా కేంద్రంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖతో పాటు రెవెన్యూ, పుడా, సచివాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి సర్వేనెంబర్ 454-2, 454-3, 454-6లో 7.66 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. పెద్ద భవనాలు, స్విమ్మింగ్ పూల్స్‌ను నిర్మించారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సర్వేనెంబర్ 308 కప్పలబండ పొలంలో 21.42 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేశారన్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందన్నారు. పుట్టపర్తి, పరిసర మండలాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉందని తక్షణం వీటిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, పుట్టపర్తి పట్టణ కార్యదర్శి బ్యాల్లా అంజి, రామకృష్ణ, సిపిఎం ఆఫీస్ కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.



ఆర్డీవో భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఇళ్ల వద్దే పింఛను అందించాలి : టిడిపి

ప్రజాశక్తి -పెనుకొండ రూరల్

వృద్ధులు, వికలాంగులు, ఇతర పింఛను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బికె. పార్థసారధి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుండి వాలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని వారికి ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించిందని అన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సేవలను వినియోగించుకుని లబ్దిదారులకు ఇళ్ల వద్దనే అందించాలని డిమాండ్ చేశారు.

జగన్ రెడ్డివి స్వార్ధ రాజకీయాలు : జగన్ రెడ్డి స్వార్ధ రాజకీయం వల్లే ఫించన్ దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ విమర్శించారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు ఎన్నికల కోడ్ కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచిపెట్టారని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ఫించన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణం అని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సవితమ్మ

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రస్తుత వేసవిలో త్రాగునీటి సమస్య జిల్లాలో ఎక్కడ తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం,విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుతున్నామని అన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని అవసరమైన బోర్ల మరమ్మతులు చేపట్టామని అన్నారు. వేడి గాలులు తీవ్రత వల్ల వడగాల్పులకు గురి కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జున, డ్వామా పీడీ విజయకుమార్, వార్డు గ్రామ నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు హేయం : టిడిపి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కదిరి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్, నాయకులను కదిరి పట్టణ పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆపార్టీ నాయకులు విమర్శించారు. ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరదాలు చాటున తిరిగే ముఖ్య మంత్రి ప్రజలను ఏమి ఉద్ధరిస్తారని వారు ప్రశ్నించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన నాయకులు ఇలా ప్రశ్నించే వారిని అరెస్టులు చేయిస్తూ పాలన సాగించడం విచారకరం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ బాబ్జాన్,కావడి ప్రవీణ్ కుమార్, సల్మాన్ ఖాన్, హరి,తాజు ఖాన్, వినోద్, జియావుల్లా, తలారి వినోద్, రోషన్, లోకేష్ నాయుడు, ప్రవీణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు



చిన్నారులకు ఫైల్స్ అందిస్తున్న శ్రీనివాసులు,

ఘనంగా నర్సరీ డే

హిందూపురం :పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో సోమవారం ఘనంగా నర్సరీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, వైద్యులు నందిత, చందన దీప్తి, సాదీన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం నర్సరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫైల్స్, మిఠాయిలను అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, నర్సరీ ఉపాధ్యాయిని అనిత తదితరులు పాల్గొన్నారు.

పింఛనుకు ఆధార్ తప్పనిసరి

గాండ్లపెంట : పింఛను లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు చూపించి పింఛను తీసుకోవాలని ఎన్పీకుంట ఎంపిడిఒ ఆదినారాయణ తెలిపారు. ఈనెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకు ప్రతి పింఛను లబ్ధిదారుడు ఆధార్ కార్డు చూపించి సచివాలయం వద్ద పింఛను తీసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

గాండ్లపెంట : ఎన్పీకుంట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ నరేంద్రకుమార్, ఎంపిడిఒ ఆదినారాయణ సోమవారం ప్రారంభించారు. ప్రయాణికులు, వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రానికి వచ్చే వారు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మట్టి మాఫియాను అరికట్టండి

పుట్టపర్తి రూరల్ :ఉమ్మడి అనంతపురం జిల్లాలో మట్టి మాఫియాను అరికట్టాలని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్చి 2023లో రూ. 11 కోట్ల టెండర్ దక్కించుకున్నారన్నారు. టెండర్‌దారులు రెండు నెలలు గడవకనే 8 కోట్లకు తగ్గించడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి మూడు కోట్ల రూపాయల గండి పడిందన్నారు. సరైన అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నా విజిలెన్స్ మైనింగ్ అధికారులు నిద్రపోతున్నారని విమర్శించారు. సిఎం జగన్ ఎన్నికల ప్రచారం బస్సు యాత్రలో భాగంగా కదిరిలో సిపిఐ సిపిఎం నాయకులు అరెస్టు చేయడాన్ని సిపిఐ ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, నల్లగొండ మండల కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని యాదవ వీధిలో గల శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిర్మానానికి దాతలు విరాళం అందజేశారు. ధర్మవరం రిటైర్డ్ హెడ్మాస్టర్ పుల్లారెడ్డి లక్ష రూపాయలు, అనంతపురానికి చెందిన అంబటి మల్లికార్జున రూ.25,116, అంబటి ఫణిరాజ్ రూ.25,116,కరణం మైథిలి రూ.25,116లు తమవంతుగా ఆలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మాల గుండ్ల మల్లికార్జున, కార్యదర్శి రమణారెడ్డి, సహకార్యదర్శి కోటి వెంకటేష్, కోశాధికారి పిన్ను సురేష్ బాబు, కమిటీ సభ్యులు మైలవరం సాయినాథ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షల నిర్వహణ పట్ల హర్షం

పుట్టపర్తి : కొత్త జిల్లా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ముగియడం పట్ల వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక డిఇఒ కార్యాలయంలో విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎద్దుల రాఘవరెడ్డి, డిఇఒ మీనాక్షి, ఏడీలు నాగరాజు, రామకృష్ణలను ఆ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, పీవీ రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంద్రప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ ఎన్నికల కార్యాలయం ఏర్పాటు

మడకశిర : పట్టణంలోని పెనుగొండ రోడ్డులో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, కుంచిటి ఒక్కలిగా రాష్ట్ర కన్వీనర్ వి ఎ పాండురంగప్ప సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అశ్వర్థామప్ప, రామకృష్ణప్ప, హనుమంత గౌడ్, ఈశ్వర్ సాగర్, రామన్న, అచ్చంపల్లి రమేష్, మంజునాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో గుత్తేదారుల ఆందోళన

బిల్లులు ఇవ్వకపోవడంతో ఫర్నిచర్ ధ్వంసం
కమిషనర్ హామీతో శాంతించిన గుత్తేదారులు



అకౌంట్స్ విభాగంలో ధ్వంసం అయిన ఫర్నీచర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో గుత్తేదారులు ఆందోళనకు దిగారు. పురపాలక సంఘ వ్యాప్తంగా తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రూ. కోట్లల్లో బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆందోళనకు అధికారులు పట్టించు కోకపోవడంతో సహనం కోల్పోయిన గుత్తేదారులు మున్సిపల్ కార్యాలయంలోని అకౌంటెంట్ గదిలోకి దూసుకెళ్లి గది కిటికీ అద్దాలు, టేబుల్ మీద ఉన్న అద్దం, ఫర్నీచర్ తో పాటు కంప్యూటర్ మానిటర్ సైతం పగలు కొట్టారు. ఆందోళన ఉధృతం కావడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. వారు రంగంలోకి దిగి ఆందోళన చేస్తున్న గుత్తేదారులకు నచ్చజెప్పి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గుత్తేదారులు ప్రభాకర్, బాలాజీలు మాట్లాడుతు గత 8 నెలల నుంచి చేసిన అభివృద్ధి పనులకు సంబందించిన బిల్లులను మున్సిపల్ కార్యలయంలోని అకౌంట్స్, ప్రీ ఆడిట్ అధికారులు సకాలంలో సిఎఫ్ఎంఎస్ లో అప్‌లోడ్ చేయక పోవడంతో తమకు బిల్లులు రాలేదన్నారు. పురపాలక సంఘంలో 15 మంది గుత్తేదారులు గత 8 నెలల కాలంగా అప్పులు చేసి దాదాపు రూ.3కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నప్పటికి అకౌంట్స్ విభాగం వారు ఒకరిపై ఒకరు వేసుకుంటు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చేసిన అన్ని పనులకు బిల్లులు చేయలేదని, కేవలం రూ.1.24 కోట్ల బిల్లులు మాత్రమే సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని అన్నారు. ఇంకా దాదాపు రూ. 2కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేయలేదన్నారు. అప్‌లోడ్ చేసిన బిల్లులను సైతం ప్రీ ఆడిట్‌లో విధులు నిర్వహిస్తున్న రవి శంకర్ తనకు మాముళ్లు ఇవ్వలేదని, అప్రూవల్ చేయక పోవడంతో అవి సైతం నిలచి పోవడం జరిగిందన్నారు. తాము ఎదో మిగులుతుందని అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని మార్చి నెలలో అన్ని బిల్లులు వస్తాయని, ఎప్రిల్ లో చెల్లిచాల్సిన అప్పులను చెల్లిస్తామని అందరికి చెప్పామని అన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా అకౌంటెడ్, ప్రీ ఆడిట్ అధికారులు తమ బిల్లుల విషయంలో నిర్లక్ష్యం చేయడంతో కడుపు కాలి తిరగబడ్డమన్నారు. ఇంత జరుగుతున్నా తన దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని కమిషనర్ అడిగారు. ప్రతి రోజు అకౌంట్, ప్రీ ఆడిట్ అధికారులు తాము చేస్తామని చెప్పారని కమీషన్ కోసం ఇలా చేస్తారని ఊహించలేదని అన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలే కాని కార్యాలయం పై దాడి చేయడం వల్ల బిల్లులు వస్తాయా అని కమిషనర్ అన్నారు. సమస్యకు పరిష్కారం చూపక ముందే ఇలా చేయడం తగదని కమిషనర్ అన్నారు. రవి శంకర్ ఉంటే తాము అభివద్ధి పనులు చేయలేమన్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే తమ బిల్లులు మంజూరు కాక పోతే ఎవరు భాధ్యత వహిస్తారని కమిషనర్‌ను గుత్తేదారులు ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు మంజూరు అయ్యే విధంగా తాము చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫర్నీచర్ ధ్వంసంపై కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి వివరణ కోరగ జరిగిన సంఘటనపై పరిశీలించి వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం



పార్టీలోకి చేరిన వారితో 'కందికుంట '



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి - తలుపుల

మండలం బట్రేపల్లి, పంచాయతీ మూలపల్లి, బట్రేపల్లి, సిద్దుకూరు పల్లి,రెడ్డివారి పల్లి,వీరప్ప గారి పల్లిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. తెలుగుదేశానికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓబుళదేవర చెరువు : మండలం అల్లాపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుక్కంటివారిపల్లిలో టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ నారాయణ, పివి రమణ, ఎం కృష్ణమూర్తి , సీనియర్ నాయకులు బోయపల్లి శివారెడ్డి, ఆటో ప్రభాకర ,ట్రాక్టర్ శివ, బోయపల్లి లక్ష్మీనరసు, శంకర శ్రీనివాసులు సిసింద్రీ, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని ఈతోడు గ్రామానికి చెందిన దాదాపు 20 కుటుంబాలు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుంచే నాగేంద్ర ప్రసాద్, నాయకులు సుంకర మురళి, ఒంటెద్దు కిష్టప్ప, ఆధ్వర్యంలో కదిరి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ సమక్షంలో టిడిపిలోకి చేరారు. అయన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, ఒంటెద్దు కిష్టప్ప, సోముశేఖర్, జి వేణుగోపాల్, ఎంఎస్. చిన్న రామిరెడ్డి, కుళ్లాయరెడ్డి, గుంజువారిపల్లి నల్లప్ప, జయచంద్రారెడ్డి, తదితర టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలం గాజులవారిపల్లి పెద్ద తండా మాజీ ఎంపీటీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో కదిరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. భాస్కర్ నాయక్, సుధాకర్, రామకృష్ణ నాయక్, శ్రీకాంత్ నాయక్, ఎస్.హరి నాయక్, దీప్లా నాయక్, ఈ.భాస్కర్ నాయక్, ఎస్.బాలాజీ, ఎస్. ఆంజనేయులు, ఆర్.శ్రీనివాసులు, కే.వెంకటేశ్ తదితరులకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సి.కొండయ్య,ప్రసాద్, కాకర్ల రవీంద్ర రెడ్డి, సభావత్ అంజి నాయక్, సాకే పవన్ కుమాంతదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు పంచాయతీలో టీడీపీ ఇంటింటి ప్రచారం చేపట్టింది. బాబు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం చేస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోడూరు పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల : గుడిబండ మండలంలోని సింగేపల్లి.మోపురుగుడు, కెజిఎన్ పాలెం, గుడిబండ గ్రామాల్లో మడకశిర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ ప్రచారంలో మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. గుడిబండ గ్రామంలో ని ఎస్సీ కాలనీ కోటవీదిలో అనిల్ కుమార్, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవక్కలిగల సాధికార సమితి అధ్యక్షులు పాండురంగప్ప హిందూపురం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు బిఎల్ఆర్ వీరకేతరాయప్ప, మాజీ ఎంపీపీలు అశ్వర్థ రామప్ప, హనుమంత రాయుడు, ఆదినారాయణ, ఉగ్ర నరసింహప్ప, అమరాపురం మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో సిఎం జగన్, ఇతర నాయకులు

జగన్ సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - హిందూపురం

లేపాక్షి మాజీ మండల అధ్యక్షులు హనూక్, తెలుగుదేశం పార్టీ నాయకులు, చంద్ర దండు రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సార్ అహమ్మద్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో సోమవారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో హనూక్ లేపాక్షి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. అదే విధంగా తెలుగుదేశం పాలనలోనే చంద్రదండు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అన్సార్ అహ్మద్ పని చేశారు. వైసిపి అధికారంలో వచ్చిన తరువాత వీరు తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా సంజీవపురం స్టే పాయింట్ లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వారు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని కోడప గాని పల్లి గ్రామంలో వైసిపి నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు .ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్ రెడ్డి ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అబ్జర్వర్ ఆవుటాల రమణారెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి బావమరిది రాఘవరెడ్డి, స్థానిక సర్పంచి అలివేలమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ఎంపిటీసీ వరలక్ష్మి, స్థానిక నాయకులు నరసింహారెడ్డి, చౌరెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రానున్న ఎన్నికల్లో అందరం కలిసి హిందూపురంలో వైసిపి జెండాను ఎగురవేద్దామనిమైనార్టీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి స్థానిక కార్యాలయంలో వైసిపి నాయకులు వేణురెడ్డి మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరు కలిసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపికలను గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్ జబివుల్లా, మాజీ ముతవల్లికలీం, చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకున్న 'బాబు' : వైసిపి

హిందూపురం : సామాజిక పింఛన్లు ఇవ్వకుండా టిడిపి నేత చంద్రబాబు అడ్డుకుని తన పెత్తందారీ మనస్తత్వం మరో సారి చూపించారని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక విమర్శించారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆమె మాట్లాడుతు చంద్రబాబు లబ్ధిదారులకు ఈ నెల 1న ఫించన్ అందకుండా చేశారన్నారు.

జగన్ రోడ్‌షోకు విశేష స్పందన



బత్తలపల్లి రోడ్‌షోలో సిఎం జగన్ అభివాదం



కదిరి రోడ్‌షోకు హాజరైన జనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం సాయంత్రం కదిరి పట్టణానికి చేరుకుంది.అంతకు ముందు కదిరి రూరల్ వద్ద వైసిపి అభ్యర్థి మక్బూల్,వైసీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్, పూల శ్రీనివాస్ రెడ్డి సాకత్‌అలీ తదితరులు స్వాగతం పలికారు. జగన్ రాక ఆలస్యం కావడంతో ముందుగా నిర్ణయించిన ఇఫ్తార్ విందుకు హాజరుకాలేక పోయారు. దీంతో ముస్లిం లుతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనలేక పోయారు . దీంతో మైనార్టీలు నిరుత్సాహం చెందారు. కేవలం రోడ్ షో లో అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

సామాన్యులకు తిప్పలు : ముఖ్యమంత్రి జగన్ కదిరి పర్యటన నేపథ్యంలో పోలీసులు ప్రతిపక్ష వామపక్ష సీపీఎం టీడీపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్లో ఉంచారు. బస్సుయాత్ర వల్ల ప్రజలకు తిప్పలు తప్పలేదు, జగన్ సాయంత్రం 4కి కదిరి రావాల్సి ఉండగా మధ్యాహ్నం నుండే పోలీసులు పట్టణంలో ఎక్కడి కక్కడ భారీకేట్లు అడ్డుపెట్టారు. అనంతపురం వైపు వెళ్లాల్సిన ఆర్ టి సి బస్సులను సైతం దారి మళ్లించారు. దీంతో 30 కిలోమీటర్లు మేర చుట్టేసుకొని వెళ్లడంతో ప్రయాణికులు అసౌకర్యానికి లోనయ్యారు.

పార్టీలోకి అత్తార్ : టీడీపీ కి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద శ్రేణులతో కలిసి భారీ గజమాలతో జగన్‌కు స్వాగతం పలికారు . చాంద్ బాషాతో పాటు ఆయన వర్గీయుల ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో టీడీపీ లో చేరారు.జగన్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముదిగుబ్బ : మేము సిద్ధం బస్సు యాత్రలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సిఎం జగన్ మోహన్ రెడ్డికి స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. నాలుగు కూడలిలో గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, మాజీ కో ఆప్షన్ కుళ్లాయప్ప ,సర్పంచ్ లక్ష్మీదేవిచెన్నరాయుడు, అధికసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

బత్తలపల్లి : శ్రీ సత్యసాయి జిల్లాలో సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని సంజీవపురం గ్రామసమీపంలో బస చేసిన సీఎం జగన్ సోమవారం ఉదయం 9 గంటల తరువాత బస్సు యాత్ర ప్రారంభించారు. మండల కేంద్రంలో వృద్ధులు, మహిళలు, పిల్లలు బస్సు యాత్రకు స్వాగతం పలికారు. ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన వైసిపి శ్రేణుల మధ్య కూడలిలో రోడ్ షో కొనసాగింది. బస్సు పై జగన్ ప్రక్కన ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ. కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు తదితరులు ఉన్నారు.

క్రేన్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామ సమీపాన పులివెందుల ఘాట్లో క్రైన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబందించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గోరంట్ల రూరల్ : మండలంలోని గుంతపల్లి వద్ద గల నిషా గార్మెంట్స్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన రిటైర్డ్ హెచ్ఎం నాగప్ప, పుట్టగుండ్లపల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ కుటుంబాలను టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతదేహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహప్ప, బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి, శ్రీనివాసులు, రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరే వేణుగోపాల్ రాయల్, పుల్లేరు సుబ్రహ్మణ్యం, నరేష్ కుమార్, పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

హిందూపురం : అమ్మాయిల చదువే వారి భవిష్యత్తుకు రాచబాట వేస్తుందని, వారు ఉన్నత చదువులు చదివించే దిశగా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి తల్లిదండ్రులను కోరారు. సోమవారం కళాశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతు విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకానికి తగినట్లుగా అధ్యాపకులు అంకితభావంతో విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు ఈ కళాశాలలో చదవడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సరస్వతి, అధ్యాపకులు డాక్టర్ శ్రీలక్ష్మి, గోపాల్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, మడకశిర, రొద్దం, పెనుకొండ, కళ్యాణదుర్గం, చిలమత్తూరు, పరిగి, సోమందేపల్లి తదితర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కొరత లేకుండా సంబంధిత అధికారులు, సిబ్బందికి తగినచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు భవనంలో సోమవారం వాటర్ సప్లై సిబ్బందికి, ఇంజనీరింగ్ విభాగపు అధికారులకు, సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూపట్టణంలోని 40 వార్డులలో నీటికొరత లేకుండా చూడాలన్నారు.ప్రతి రోజు వార్డుల వారీగా షెడ్యూల్ తేదీ ప్రకారం నీటిని సరఫరా చేయాలన్నారు. అధికారులు పర్యవేక్షణ చేస్తూ సిబ్బంది చేత అనుకున్న షెడ్యుల్ ప్రకారం తప్పనిసరిగా నీటిని పంపిణీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగపు ఈఈ సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు సిఫార్సు

పుట్టపర్తి : మండల పరిధిలోని మారాల గ్రామంలో క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న రామ్మోహన్‌పై చర్యలు చేపట్టడానికి అధికారుల సిద్ధమయ్యారు. ఆదివారం కొత్తచెరువు మండల కేంద్రంలో వైసిపి ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను కలిసి ఎన్నికల ప్రచారంలో రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాసులు వివరాలు సేకరించారు.ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు లిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఫీల్డ్‌అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ చెప్పారు.

ఎపిపిఎస్‌సి అక్రమాలపై చర్యలకు డిమాండ్

పుట్టపర్తి : ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై పాత్ర ఉన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ లపై కేసులు నమోదు చేయాలని తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు పట్టణ సీఐ కొండారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ పబ్లిక్ సర్వీస్ గ్రూప్ 1 పరీక్షలలో అక్రమాలకు పాల్పడ్డ ముఖ్యమంత్రి, చైర్మన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా వేచి ఉన్న నిరుద్యోగులు గ్రూప్ 1 పరీక్షలకు హాజరై పరీక్షలు రాసిన తరువాత మూల్యాంకనంలో భారీగా అక్రమాలకు పాల్పడి నిరుద్యోగులతో చెలగాటం ఆడుకున్నారన్నారు. ఇందులో ప్రభుత్వ కార్యదర్శి ఆంజనేయులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర కూడా ఉందన్నారు. సమగ్ర విచారణ చేయించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఓబులరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు కృష్ణారెడ్డి, వై మురళి చౌదరి, జిల్లా కార్యదర్శి గణేష్ చౌదరి, మహేష్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శిగా సంపత్ కుమార్

హిందూపురం : భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) జాతీయ కార్యదర్శిగా హిందూపురం పట్టణానికి చెందిన సంపత్ కుమార్ నియమిస్తు జాతీయ అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ తో పాటు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో సంపత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఐక్య విద్యార్థి సంఘ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, అభిలాష్, అభిషేక్, యూత్ కాంగ్రెస్ వంశీకృష్ణ, జనసేన నాయకులు నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఆపి చంద్రబాబుపై నిందలా..?: టిడిపి

పుట్టపర్తి రూరల్ : సామాజిక పింఛన్ల పంపిణీని ఆపి చంద్రబాబునాయుడిపై నిందలు వేయడం అన్యాయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో గ్రామ ,వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా తప్పనిసరిగా ఇంటింటికి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని అయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వైసీపీ ప్రభుత్వ పెద్దలు వాలంటీర్లు లేరనే సాకుతో పింఛన్ల పంపిణీని ఆపి ఆ నిందను టీడీపీ అధినేత చంద్రబాబు పై వేసేందుకు స్కెచ్ వేసిందని విమర్శించారు. వాలంటీర్లు లేరనే సాకుతో పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయకూడదని వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని. ఎన్నికల కమిషన్‌ను కోరారని గుర్తు చేశారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిపై వైసీపీ పెద్దలకు నమ్మకం లేకనే పింఛన్ల పంపిణీకి జాప్యం చేస్తున్నారని విమర్శించారు.

ధర్మవరం టౌన్ : పింఛన్లు పంపిణీ చేసేందుకు నిధులు లేక టీడీపీ ఏదో చేసినట్టు వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం టీడీపీ, బీజేపీ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సంబంధించిన కాంట్రాక్టర్లకు డబ్బు దోచి పెట్టి సీఎం జగన్ కొత్తనాటకానికి తెరలేపారన్నారు. పైగా దీనిని ఎన్నికలలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మార్చి 16-30 మధ్య 15 రోజుల్లోనే ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని విమర్శిం చారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణమని ఎన్నికల కమిషన్, టీడీపీ కాదని అన్నారు. వాలంటీర్లకు తాము వ్యతిరేకంగా కాదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లను కొనసాగిస్తామని, పార్టీలకు అతీతంగా పనిచేసేలా చర్యలు కూడా తీసుకుంటామని అన్నారు. ఈనెల 4 కూటమి అభ్యర్థి సత్యకుమార్ ధర్మవరానికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లు వాటిపై సమాలోచనలు చేశామన్నారు. ధర్మవరంలో జనసేన కూడా బలంగా ఉన్న నేపథ్యంలో ఆ పార్టీని కూడా కలుపుకుని ముందుకువెళ్లామని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థినుల ప్రతిభ

కదిరి టౌన్ : విజయవాడ లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇందిరా గాంధీ స్టేడియం లో జరిగిన ఖేలో ఇండియా బాలికల లీగ్ స్క్వే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. అండర్ 14, 17 సీనియర్ బాలికల మధ్య లోబ, ఖవానకీ విభాగాలలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మాస్టర్ షాకీర్, మాస్టర్ మురళీకృష్ణ రెడ్డి వద్ద శిక్షణ తీసుకుంటున్న విద్యార్థునులు ప్రతిభ కనపర్చారు. అండర్ 14 లోబ -45 కేజీల విభాగంలో రోషిని, ఖవానకీ లో హారిక మూడవ స్థానాన్ని, అండర్ 17 ఖవానకీ కె2 విభాగంలో హాసిని రెడ్డి మొదటి స్థానాన్ని,సీనియర్ -58 కేజీల లోబ విభాగంలో చాందిని మొదటి స్థానం సాధించి సౌత్ జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్క్వే మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్, కార్యదర్శి ఇబ్రహీం అభినందనలు తెలిపారు.